క్లుప్తంగా

మాజీ మంత్రి రోజాకు పలువురి శుభాకాంక్షలు



రోజాకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ, కోఆప్షన్ సభ్యురాలు

మాడుగుల రూరల్: ప్రముఖ సినీనటి, మాజీ మంత్రి ఆర్.కె. రోజా గురువారం రాత్రి రావికమతం మండలం దొండపూడిలో జరిగిన దుర్గాలమ్మ జాతరకు హాజరయ్యారు. ఆమె వివాహ వార్షికోత్సవం కావడంతో మాడుగుల మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు దొండపూడి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఎంపీపీ తాళ్ల పురెడ్డి వెంకట రాజారామ్, మండల కోఆప్షన్ సభ్యురాలు షేక్ అహ్మద్ ఉన్నీసా తదితరులు ఆమెను సత్కరించారు.

ఈ నెలాఖరు వరకూ లంపీ స్కిన్ టీకాల కార్యక్రమం



వి.సంతపాలెంలో బ్లాంకెట్ సర్వేను పర్యవేక్షిస్తున్న డీడీ చంద్రశేఖర్

కె.కోటపాడు: లంపీ స్కిన్ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా తెలుపు రంగు జాతి పశువులకు ఈ నెల 1 నుండి టీకాలు వేస్తున్నట్లు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వి.సంతపాలెం, ఎ.కోడూరు గ్రామాల రైతులకు అందుతున్న సేవలను తనిఖీ చేశారు. నెలాఖరు నాటికి శతశాతం టీకాల కార్యక్రమం పూర్తి చేయాలని తెలిపారు. వర్షాకాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొరువాడ పశు వైద్యాధికారి సింహాచలం నాయుడు, పశువైద్య సహాయకురాలు అల్లు మంగ పాల్గొన్నారు.

నేడు ఐదు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.కోటపాడు: మండలంలో కలిగొట్ల ఫీడర్ పరిధిలో గల ఐదు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం ఈ ఫీడర్ పరిధిలో గల గ్రామాలైన పైడంపేట, రొంగలినాయుడుపాలెం, పాచిలవానిపాలెం, మురుగుపాలెం, బంటు వారి కళ్లాల్లో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జమ్మిదేవిపేటలో వైద్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

గొలుగొండ: మండలంలో జమ్మిదేవిపేటలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ ఆధ్వర్యంలో సుమారు 30 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని, ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తామని వైద్య సిబ్బంది తెలిపారు.

24న స్కాలర్‌షిప్స్‌పై అవగాహన సదస్సు

నర్సీపట్నం: దేశంలో వివిధ కార్పొరేట్ కంపెనీలు అందిస్తున్న స్కాలర్‌షిప్‌లపై శ్రీవాసవీ వన్‌రుపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న శ్రీవాసవీ కల్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి గ్రంధి రమణబాబు తెలిపారు. ఈ స్కాలర్‌షిప్స్‌కు దేశంలో ఎక్కడి నుండి అయినా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఏ విధంగా చేసుకోవాలనే దానిపై సమగ్రమైన అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సెమినార్‌కి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరు కావచ్చన్నారు.

వినాయక నవరాత్రులకు అనుమతులు తప్పనిసరి

మాడుగుల: వినాయక నవరాత్రి ఉత్సవాలు బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేస్తే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ నారాయణరావు తెలిపారు. స్టేజీలు ఏర్పాటు చేస్తే అక్కడ కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలన్నారు. అనుకోని సంఘటనలు జరిగితే ఫైర్ స్టేషన్, పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.



నాసిరకం పనులతో కొద్ది రోజుల్లోనే దెబ్బతిన్న నిండుగొండ రోడ్డు



ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ప్రమాదకరంగా మారిన భారీ గొయ్యి

పనుల్లో డొల్ల.. అభివృద్ధి కల్ల

- అసంపూర్తిగా జీఎన్ రోడ్డు పనులు
- పూడ్చని గోతులు.. తవ్వి వదిలేసిన రహదారులు
- కూటమి హామీలు ఏమయ్యాయంటున్న ప్రజలు, వాహన చోదకులు



మండల కూడలిలో బోల్తా పడిన కొత్తకోటకు చెందిన ఆకుల వ్యాన్ (ఫైల్)

రోలుగుంట: సంక్రాంతికి రహదారులు పూర్తి చేస్తాం అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. అలాగే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. అయితే అలా ప్రకటించి నెలలు కావస్తున్నా ఆ హామీ అమలు జరిగింది లేదు. మరో నాలుగు నెలల్లో కూటమి ప్రభుత్వానికి రెండో సంక్రాంతి కూడా వచ్చేస్తుంది. కూటమి ప్రభుత్వం వస్తే అభివృద్ధి జరుగుతుందని ఆశ పడిన ప్రజలు మాత్రం శిథిల రహదారుల్లోనే ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మోసపూరిత హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం భీమిలి–నర్సీపట్నం రహదారి సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

కాలువలు తవ్వి.. పూడ్చకుండా వదిలేశారు..

నాలుగు మాసాల క్రితం మండల కేంద్రం రోలుగుంటలో పంచాయతీ కార్యాలయం సమీపంలోని రోడ్డు నుంచి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రి వరకూ.. అలాగే కొత్త చెరువు నుంచి భోగాపురం వరకు కాంట్రాక్టర్ కాలువలు తవ్వించారు. అయితే తర్వాత కొన్ని చోట్ల మాత్రమే కాలువలు పూడ్చి మిగిలిన భాగం పూడ్చకుండా వదిలేశారు. అలాగే రహదారిలోని గోతులు కొన్ని మాత్రమే పూడ్చి మిగిలినవి వదిలేశారు. గత నెల వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బైక్ ర్యాలీ నిర్వహించి వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి కొన్ని గోతులు పూడ్చారు. ఇది చూసి కూటమి నాయకులు ఆ మర్నాడే కొన్ని గోతులు పూడ్పించారు.



హనుమాన్ గుడి సమీపంలో రోడ్డు విస్తరణ కోసం తవ్వి వదిలేసిన కాలువ

పనుల్లో డొల్లతనం..

రెండు మాసాల క్రితం ఈ రోడ్డులో నిండుగొండ కూడలి నుంచి స్థానిక చెరకు కాటా వరకూ చేపట్టిన మరమ్మతు పనుల్లో డొల్లతనం బయటపడుతోంది. నిర్మాణ పనులు చేపట్టిన కొద్ది రోజులు గడవక ముందే పనుల్లో నాణ్యతా లోపం కనిపిస్తోంది. ఈ కొత్త రోడ్డులో నిండుగొండ కూడలి నుంచి రోలుగుంట వరకూ అలాగే కంచుగుమల, భోగాపురం తదితర ప్రాంతాల్లో ఉన్న గుంతలు ప్రమాదకరంగా మారాయి. వీటి వద్ద కనీస హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే ప్రజా ప్రతినిధులు, అధికారులు అలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు పనులు పూర్తిస్థాయిలో చేయించి, ప్రమాదాలు తొలగించాలని, రహదారి కష్టాలు నివారించాలని కోరుతున్నారు.

శిథిల రహదారికి మరమ్మతు చేయాలి



భీమిలి–నర్సీపట్నం రోడ్డు పలు మండలాలు, నియోజక వర్గాల ప్రజలకు ఎంతో ముఖ్యమైనది. ఎక్కడికి వెళ్లాలన్నా ఈ రహదారినే వినియోగిస్తారు. పాడేరు, చోడవరం, నర్సీపట్నం మీదుగా అనేక నియోజవర్గాల వారు ఈ దారిలో ప్రయాణాలు సాగిస్తారు. కనుక శిథిల రహదారులకు మరమ్మతు చేయాలి.

– మజ్జి నూకరాజు, రైతు నాయకుడు, కొంతలం

ఇచ్చిన హామీ నెరవేర్చాలి



ప్రతిపక్షంలో ఉన్నపుడు గోతుల పైనే గోల చేసే వారు తెలుగుదేశం పార్టీ వారు. ఇప్పుడు మరో రెండు పార్టీలతో జత కట్టి కూటమి ప్రభుత్వంగా అధికారంలోకి వచ్చారు. రహదారి సమస్య ప్రధానమైనదిగా భావించి సత్వరం రోడ్లను మెరుగుపరచండి.

– కర్రి వీరునాయుడు, కొండపాలెం

వాహనాలు శిథిలం అవుతున్నాయి



ఈ గోతుల రోడ్లలో ప్రయాణికులను తీసుకెళ్లాలంటే భయమేస్తుంది. మా వాహనాలు శిథిలం అవుతున్నాయి. అవి ఈ గోతుల్లో పడి ఎక్కడ బోల్తా కొడతాయోనని ఆందోళన పడుతున్నాం. హామీలు నమ్మి గెలిపించాం. రహదారి పనులు చేయించండి.

– కె.రమణ, ఆటో డ్రైవర్, రోలుగుంట

ఇన్సూరెన్స్ చెక్ అందజేత



ఇన్సూరెన్స్ చెక్ అందజేస్తున్న బీఎం ఎడ్వర్డ్

నర్సీపట్నం: పీఎంజేజేబీవై ఇన్సూరెన్స్ చెక్‌ను బాధిత కుటుంబానికి ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ ఎడ్వర్డ్ శుక్రవారం అందజేశారు. నర్సీపట్నం మండలం, అమలాపురానికి చెందిన టీకు కన్నతల్లి అనారోగ్యంతో ఇటీవల మరణించింది. సంబంధిత ఇన్సూరెన్స్ చెక్‌ను మృతిరాలి కుమార్తె సూర్యదేవికి బీఎం అందజేశారు. ఏపీజీబీ బ్యాంక్ ద్వారా అనేక సదుపాయాలు కల్పిస్తున్నామని, బ్యాంకింగ్ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు పావని, అప్పలనాయుడు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

కె.కోటపాడు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. కె.కోటపాడులో జరిగిన పార్టీ మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తలు కూటమి ధర్మాన్ని పాటిస్తూ బూత్ కమిటీలు నియమించాలన్నారు. వచ్చే నెల 8న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ జిల్లాలో పర్యటించనున్న దృష్ట్యా మండలాల్లో ముఖ్య సమస్యలను తనకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు పైల అమ్మాజీ, చల్లా సత్యనారాయణమూర్తి, కోట్టాన ఈశ్వరరావు, దొగ్గ ఈశ్వర ప్రసాద్, శరగడం సన్యాసినాయుడు, జనపరెడ్డి సూర్యనారాయణ, కూండ్రపు గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తాం



బ్రిటిష్ సమాధులను పరిశీలిస్తున్న అజశర్మ తదితరులు

నర్సీపట్నం: స్థానిక బ్రిటీష్ సమాధుల స్థలంలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను కూల్చకపోతే కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటానికి గుర్తుగా ఉన్న బ్రిటిష్ సమాధులను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అజశర్మ మాట్లాడుతూ అల్లూరి పోరాటానికి స్మృతిగా ఉన్న బ్రిటిష్ సమాధుల స్థలం అక్రమించి నిర్మాణాలు చేస్తుంటే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ కట్టడాలని కూల్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి వేదిక నాయకులు శాస్త్రి, టాక్స్ పేయర్ అసోసియేషన్ నాయకులు కె.త్రిమూర్తులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆఖరి శుక్రవారం పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత ఆలయంలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పూజలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు, గోమాతకు పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు పర్యవేక్షణలో, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ సారధ్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. కె.జె.పురం గ్రామం నుంచి ఆలయానికి మోదమాంబ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వేగి రాము సహకారంతో ఉచిత ఆటో సౌకర్యం కల్పించారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

కె.కోటపాడు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆలయ అర్చకులు గోరుగుంతు రమేష్ బాబు మహిళలతో కుంకుమార్చన జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల రాంబాబు (రాము), గ్రామ ఉప సర్పంచ్ రెడ్డి అరుణ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.



కె.జె.పురంలో సంతోషిమాతకు పూజలు

పెద్దమిల్లు జంక్షన్‌లో..

మాకవరపాలెం: పెద్దమిల్లు జంక్షన్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణం పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం అమ్మవారికి గాజుల అలంకరణ వైభవంగా చేశారు.

కన్యకాపరమేశ్వరికి పసుపు కొమ్ములతో అలంకరణ..

దేవరాపల్లి: మండలంలో ముషిడిపల్లి కన్యకాపరమేశ్వరిని పసుపు కొమ్ములతో అలంకరించారు. శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకొని, ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, నిర్వహించారు. మండల వ్యాప్తంగా భక్తులు తరలివచ్చి, అమ్మారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మెక్కులు చెల్లించుకున్నారు.



కె.కోటపాడులో వాసవీ కన్యకా పరమేశ్వరికి కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

రైతులకు సాగులో మెలకువలు

రోలుగుంట: అనకాపల్లి క్షేత్ర పాఠశాల సౌజన్యంతో మండల వ్యవసాయ అధికారి చిరంజీవి శుక్రవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్షేత్ర పాఠశాల ఏవో విజేత సాగు పద్ధతులపై మాట్లాడారు. ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యంపై సమగ్రంగా రైతులకు వివరించారు. నారును సుడోమోనాస్ ద్రావణంలో ముంచి నాటాలన్నారు. దీని వల్ల నాటిన 20 రోజుల వరకూ కాండం తొలిచే పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జి.ఉమ, కార్తీక్, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా..

మాకవరపాలెం: రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని ఏవో అప్పారావు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఇప్పటికే నాలుగు రైతు సేవా కేంద్రాల్లో 46 టన్నుల యూరియా సిద్ధంగా ఉందన్నారు. అలాగే ప్రైవేటు దుకాణాల్లో మరో 40 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు యూరియా కోసం ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ఎక్కడైనా ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు.

అప్పన్నను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే గణేష్



స్వామి వారి సన్నిధిలో కుటుంబ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామిని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. భార్య కళావతి, కుమారులు ఆదర్స్, అవినాష్ ఆయన వెంట ఉన్నారు.

హైస్కూలుకు ట్యాబ్‌ల పంపిణీ

మాడుగుల రూరల్: విద్యార్థులు వేగంగా విద్య నేర్చుకునేందుకు ట్యాబ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని శ్రీ విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత పైలా ప్రసాదరావు పేర్కొన్నారు. మాడుగులలో గల విజ్ఞాన్ హైస్కూలును శుక్రవారం సందర్శించి ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేశారు. ట్యాబ్‌ల సహాయంతో మరింత సులభంగా పాఠాలు బోధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పైలా కొండలరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ప్రసాదరావు

ఎగ్‌కార్ట్ ప్రారంభం

మాడుగుల: ప్రభుత్వం ఉచితంగా అందించిన ఎగ్‌కార్ట్‌ని స్థానిక బస్ స్టాండ్ ఆవరణలో శుక్రవారం ప్రారంభించారు. మండలంలో వెనుకబడిన కుటుంబాలకు ఆసరా కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వెలుగు సంస్థ ద్వారా రూ. 50 వేల విలువ చేసే ఎగ్‌కార్ట్‌ని ఉచితంగా అందించింది. మండల కేంద్రంలో నూడిల్స్ వ్యాపారంపై ఆధారపడిన బొంగరాల పద్మ కుటుంబాన్ని ఎంపిక చేసి ఎగ్‌కార్ట్ ఉచితంగా అందించారు. అలాగే కె.జె.పురం గ్రామానికి చెందిన ఆడారి లక్ష్మి అనే మహిళకు ఎగ్‌కార్ట్ మంజూరు చేశారు. త్వరలో ఆమెకు ఎగ్‌కార్ట్ అందిస్తామని వెలుగు అధికారులు ప్రకటించారు. అలాగే మరొకటి మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ నియామకాల్లో లోపించిన పారదర్శకత



శ్రీనివాసరావు

నర్సీపట్నం: డీఎస్సీ నియామకాల్లో కూటమి ప్రభుత్వం పారదర్శకత పాటించలేదని వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ విభాగం నర్సీపట్నం నియోజకవర్గం అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాధారణంగా డీఎస్సీ అనంతరం మెరిట్ లిస్ట్, కేటగిరీ వారీ కటాఫ్ మార్కులను వెల్లడిస్తారన్నారు. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు మెరిట్ లిస్ట్, కటాఫ్ మార్కులు ప్రకటించకపోవడం వల్ల డీఎస్సీ అభ్యర్థులు గందరగోళానికి గురవుతున్నారన్నారు. రోస్టర్, రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వం ఎలాంటి సమాచారం ఇవ్వకపోవటం వల్ల డీఎస్సీ నియామకాల్లో పారదర్శకత లోపించిందన్నారు. డీఎస్సీ నియామకాల్లో ప్రతి దశను పారదర్శకతతో నిర్వహించాలన్నారు.

రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలి

మాకవరపాలెం: రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు సూచించారు. మండలంలోని బూరుగుపాలెం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి చరిష్మకు సూచించారు. అనంతరం పీహెచ్‌సీలో చేపట్టనున్న చిన్నచిన్న మరమ్మతులు, ఫర్నిచర్ కొనుగోలు తదితర పనులకు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బూరుగుపాలెం సర్పంచ్ వొబ్బలరెడ్డి రమణ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సర్వేశ్వరరావు

ముగిసిన వాలీబాల్, కబడ్డీ, క్విజ్ పోటీలు

రావికమతం: మండలంలో దొండపూడిలో శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి పండగ సందర్భంగా రాష్ట్ర స్థాయి వాలీబాల్, మహిళా కబడ్డీ పోటీలు, ఉత్తరాంధ్ర క్విజ్ పోటీలు నిర్వహించారు. మహిళా కబడ్డీ పోటీల్లో విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, వెస్ట్ గోదావరి, అల్లూరి సీతారామరాజు (పాడేరు) తదితర జిల్లాల నుంచి పది జట్లు పాల్గొన్నాయి. వీటిలో విజయనగరం జిల్లా ప్రథమ శ్రేణిలో, అనకాపల్లి ద్వితీయ శ్రేణిలో, గాజువాక జట్టు తృతీయ శ్రేణిలో నిలిచాయి. పురుషుల వాలీబాల్ పోటీల్లో 22 జట్లు తలపడ్డాయి. వాటిల్లో వైఎస్సార్ కడప జట్టు ప్రథమ ఏటికొప్పాక ద్వితీయ, రాజమండ్రి తృతీయ స్థానాల్లో నిలువగా, నాలుగో స్థానంలో గుమ్మాలపాడు జట్టు నిలిచింది. ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీల్లో వరుసగా ఒకటి నుంచి ఐదో స్థానంలో పలాస, సంతకమిటి, బొబ్బిలి, నెల్లిమర్ల, విజయనగరం బృందాలు నిలిచాయి. విజేతలకు చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, గ్రామ మాజీ వైస్ సర్పంచ్ ఆచారి, పాతాళ చిరంజీవి, కొప్పాక నాయుడు, వైఎస్సార్‌సీపీ గ్రామ వైస్ సర్పంచ్ గట్రెడ్డి రాజారావు, మాజీ సర్పంచ్ తాతబాబు, నాయుకులు రాజేశ్వరరావు, ధర్మ, జి. రాజు, మణిరాజు, వాలీబాల్ ఆర్గనైజర్స్ నాయుడు మాస్టర్, సహాయకులు జి. నాని తదితరులు నగదు బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు తదితరులు

సీపీఐ రాష్ట్ర మహాసభ విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న బాలేపల్లి వెంకటరమణ

నాతవరం: సీపీఐ రాష్ట్ర 28వ మహాసభ విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ అన్నారు. శుక్రవారం నాతవరంలో విలేకరులతో మాట్లాడారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈనెల 25 తేదీన జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రధానంగా చర్చ జరుగుతుందన్నారు. బ్రిటీష్ హయాం నుంచి సీపీఐ దేశం కోసం, ప్రజల కోసం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై 28న జరిగే రాష్ట్ర మహాసభలో చర్చించి ఉద్యమించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల శాఖ కార్యదర్శి అంకంరెడ్డి చిన్నయ్యనాయుడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ఎస్ 104 సెక్షన్ రద్దు కోరుతూ పిటీషన్



న్యాయవాది చంద్రశేఖర్

చోడవరం: భారతీయ న్యాయ సంహితలోని (బీఎన్ఎస్) సెక్షన్ 104ను రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం వేసినట్టు చోడవరానికి చెందిన యువ న్యాయవాది బొగ్గు సత్య చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. జీవిత ఖైదు అనుభవిస్తున్న వ్యక్తి హత్యకు పాల్పడితే ఆయనకు మరణశిక్ష లేదా జీవించి ఉన్నంత కాలం జైలు శిక్ష విధించేందుకు వీలు కల్పిస్తూ బీఎన్ఎస్ 104 సెక్షన్‌ను అమలులోకి తెచ్చారని, ఈ సెక్షన్ రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించాలని పిటీషన్‌లో కోరినట్లు తెలిపారు. దీనిపై తమ తరపున హైకోర్టు న్యాయవాది శ్రీకృష్ణసాయి భార్గవ్ వాదనలు వినిపించారని చెప్పారు. జీవిత ఖైదు అనుభవిస్తున్న వ్యక్తి హత్యకు పాల్పడితే మరణశిక్ష విధించాలని ఐపీసీ సెక్షన్ 303 చెబుతోందని, మిథు వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో ఈ సెక్షన్ రాజ్యాంగ విరుద్ధమైందని సుప్రీం కోర్టు ప్రకటిస్తూ ఈ సెక్షన్‌ను రద్దు చేసిందన్నారు. దీనిపై ఆయా శాఖలకు నోటీసులు ఇవ్వడంతో తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసిందని ఆయన చెప్పారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారం తలారి నారాయణమూర్తి గరువులో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా వుంది. ఐదు మోటార్లు, ఒక ధాన్యం మిల్లు కనెక్షన్లకు ఇదే ఆధారం. ట్రాన్స్‌ఫార్మర్‌పై హోల్స్ అన్నీ పడిపోయాయి. దీని పైన ఉన్న కటౌట్ కూడా మార్చాల్సి ఉంది. దీని పరిసరాల్లోకి స్థానిక రైతులు తమ పశువులను మేతకు వదులుతారు. వారం రోజులుగా దీనిపై ఆధారపడిన రైస్ మిల్లు, మోటారు కనెక్షన్ల మీటర్లు కాలిపోతున్నాయని, అధికారులు తక్షణం కొత్త స్తంభం ఏర్పాటు చేసి, మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



వి.వి.అగ్రహారంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్